క్లుప్తంగా

చెత్త తొలగింపులో అందరి సహకారం ఉండాలి



చెత్తను శుభ్రం చేస్తున్న మహిళలు

చిల్లకూరు : గ్రామంలో చెత్తను తొలగించే సమయంలో అందరి సహకారం ఉండాలని అదానీ ఫౌండేషన్ క్రిష్ణపట్నం పోర్టు ప్రతినిధులు తెలిపారు. మండలంలోని గుమ్మళ్లదిబ్బ గ్రామంలో శనివారం కాలువల్లో మురుగును తొలగించారు. అలాగే వీధుల్లో పడేసిన మద్యం బాటిళ్లు, చెత్తను ఒక చోటుకు చేర్చి తడి, పొడి చెత్తగా వేరు చేశారు. ఫౌండేషన్ శానిటేషన్ ట్రైనర్ సాయినాథ్ మాట్లాడుతూ అదానీ ఫౌండేషన్ సీఎస్ఆర్ కింద తీర ప్రాంత గ్రామాలను దత్తత తీసుకుని ప్రజల ఆరోగ్యంపై దృష్టి సారిస్తుందన్నారు. ఇందులో భాగంగానే గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుకు ప్రయత్నిస్తున్నట్టు పేర్కొన్నారు. గుమ్మళ్లదిబ్బ గ్రామంలో మహిళా సంఘాలను ఏర్పాటు చేసి వారి ద్వారా చెత్తను శుభ్రం చేయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మేకల వెంకయ్య, మత్స్యకార కాపులు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

కోట : పరిసరాల శుభ్రత, పచ్చదనం పెంచడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని గూడూరు డీఎస్పీ గీతాకుమారి తెలిపారు. ఆమె శనివారం కోట పోలీసులు, స్థానికులతో కలిసి క్రాస్ రోడ్డులో పరిసరాల శుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వీధుల్లో చెత్తను తొలగించారు. డీఎస్పీ మాట్లాడుతూ మండలంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటాలని సూచించారు. వాకాడు సీఐ హుస్సేన్‌బాషా, ఎస్‌ఐ పవన్‌కుమార్, ఏఎస్‌ఐ శోభారాణి పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

నాయుడుపేట టౌన్ : భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని శనివారం నాయుడుపేటలోని ప్రసూనాంబ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గణపతి హోమం, రుద్రాభిషేకం చేశారు. ఈ కార్యక్రమాలకు ఉభయకర్తలుగా అవళ్లూరు రాజయ్య, చాముండేశ్వరి దంపతులు వ్యవహరించారు. ఆలయ చైర్మన్ గూడూరు సుధీర్‌రెడ్డి, సభ్యులు ప్రభావతమ్మ, ఉగ్గుమూడి భాస్కర్‌రెడ్డి, అంకయ్య, సతీష్‌రెడ్డి, సాహిత్యరెడ్డి, అవధానం సుధీర్, చిన్నా, అశోక్, సునీల్ పాల్గొన్నారు.


టీడీపీ కార్యాలయంలో ప్రతి శనివారమూ గ్రీవెన్స్ డే



ప్రజల అర్జీలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

సూళ్లూరుపేట : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కారం కోసం పార్టీ కార్యాలయంలో ప్రతి శనివారమూ గ్రీవెన్స్‌డే ను నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. ఆమె శనివారం సూళ్లూరు పేట కచేరివీధిలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ ఇక్కడ నిర్వహించే గ్రీవెన్స్ డేలో ప్రజలు తమ సమస్యలను తన దృష్టికి తీసుకురావచ్చొన్నారు. వాటిని పరిశీలించి అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అధికారులతో కలిసి కార్యక్రమం నిర్వహించాలనుకున్నారు. వారు రాకపోవడంతో నాయకులతో కలిసి చేపట్టారు. కార్యక్రమంలో నెలవల సుబ్రమణ్యం, తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ఆకుతోట రమేష్, కొక్కు శంకరయ్య, అలవల శ్రీనివాసులు, పచ్చవ మాధవ నాయుడు, ఏజీ కిషోర్ పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా



కైవల్యా నది నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్

బాలాయపల్లి(సైదాపురం) : బాలాయపల్లి మండలం నిండలి గ్రామ సమీపంలోని కైవల్యా నది నుంచి యథేచ్ఛగా ఇసుకను తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రమైన బాలాయపల్లికి కూతవేటు దూరంలో ఉన్న నిండలి, వెంకటరెడ్డిపల్లి, గొల్లపల్లి సమీపంలోని కై వల్యా నదిలో నాణ్యమైన ఇసుక వుంది. దీనికి ఇతర ప్రాంతాల్లో డిమాండ్ ఎక్కువగా ఉండడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారు. ఈ విషయం తెలిసినా అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తుండడం పలు విమర్శలకు తావిస్తోంది.

తీరంలో తాగునీటి కష్టాలు

ఇంకా వేసవి రానేలేదు. అప్పుడే తీరప్రాంత గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. గుక్కెడు మంచినీటి కోసం గ్రామస్తులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మంచినీటి పథకాలు ఉన్నా వారానికి రెండుసార్లు కూడా నీరు సరఫరా చేయడం లేదు. వాటి నిర్వహణకు మాత్రం ఏటా రూ.లక్షలు ఖర్చు చేస్తున్నారు. గ్రామ సమీపంలోని గుంతల్లో నుంచి నీటిని తెచ్చుకుని జీవనం సాగిస్తున్నామని స్థానికులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం గ్రామాల్లో గుక్కెడు మంచి నీరు ఇవ్వడం లేదని, మద్యాన్ని మాత్రం ఏరులై పారిస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దొరువులో నుంచి నీరు తెచ్చుకుంటున్న నాగినేరి వాసులు



- మంచినీటి పథకాలున్నా తప్పని తిప్పలు
- వారానికి రెండు రోజులే సరఫరా
- గ్రామ సమీపంలోని గుంతల నుంచి నీరు తెచ్చుకుంటున్న వైనం
- పట్టించుకోని అధికారులు, పాలకులు

దొరవారిసత్రం : మండలంలోని మీజూరు పంచాయతీ కారికాడు, వేలికాడు, నాగినేరి, మీజూరు గ్రామాల్లో కొన్నేళ్లుగా తాగునీటి సమస్య ఎక్కువగా ఉంది. రెండు మంచినీటి పథకాలు ఉన్నప్పటికీ వారంలో రెండు రోజులు కూడా నీరు అందడం లేదు. కారికాడులో 270 కుటుంబాలు, వేలికాడులో 230 కుటుంబాలు, నాగినేరిలో 30 కుటుంబాలు, మీజూరులో 180 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. వీరికి తాగునీరు అందించేందుకు గతంలో ప్రభుత్వాలు రూ.లక్షలు వెచ్చించి మీజూరు, నారిగేరి గ్రామాలకు ఒక నీటి పథకం, కారికాడు, వేలికాడు గ్రామాలకు మరో నీటి పథకం ఏర్పాటుచేశారు. వాటి నిర్వహణ కోసం ఒక్కో నీటి పథకం కోసం ఏడాదికి రూ.5 లక్షలను ఖర్చు చేస్తున్నారు. రికార్డుల్లో నిర్వహణ నిధులు ఖర్చు అవుతున్నాయి తప్ప క్షేత్ర స్థాయిలో పూర్తి స్థాయిలో పథకం నీరు అందడం లేదని స్థానికులు వాపోతున్నారు.



వేలికాడులో గుంత నుంచి నీటిని తోడుకుంటున్న స్థానికులు



నాగినేరిలో అరకొరగా వస్తున్న నీటిని డ్రమ్ముల్లో నింపుకుంటున్న వృద్ధుడు

నీరు వచ్చిన రోజు పెద్ద పెద్ద డ్రమ్ముల్లో పట్టుకుని రెండు రోజులు వాడుకుంటున్నామని, తర్వాత గ్రామ సమీపంలోని దొరువుల్లోకి (చిన్నచిన్న గుంతలు) వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బయట ప్రాంతాల్లో బోర్లు వేసి...

తీర ప్రాంతాల్లో ఎక్కడా మంచినీటి వనరులు లేవు. దీంతో మీజూరు, నాగినేరి గ్రామాలకు సూళ్లూరుపేట మండలం ఆబాకు గ్రామ పరిధిలో బోర్లు వేసి అక్కడి నుంచి సుమారు 16 కిలోమీటర్లు పైపులైన్ ఏర్పాటుచేశారు. దాని ద్వారా గ్రామాల్లోని ఓవర్ హెడ్ ట్యాంకులకు నీటిని సరఫరా చేసి ప్రజలకు అందిస్తున్నారు. అదే విధంగా కారికాడు, వేలికాడు గ్రామాలకు దొరవారిసత్రం మండలం సింగనాలత్తూరులోని చెరువులో బావి తవ్వించారు. అక్కడి నుంచి మోటార్ల సాయంతో సుమారు 18 కిలోమీటర్లు పైపులైన్ ద్వారా ఓవర్ హెడ్ ట్యాంకు నీటిని సరఫరా చేస్తున్నారు. వాటి నిర్వహణ, పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడంతో తరచూ మోటార్లు, పైపులైన్లు మరమ్మతులకు గురవుతున్నాయి. దీంతో ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడంలేదు.

వారంలో ఒక్కరోజు వస్తే ఎక్కువ



మా గ్రామంలో వారంలో ఒక్క రోజు పథకం నీరు వస్తే ఎక్కువ. రోజుల తరబడి నీరు రాకపోవడంతో మా గ్రామంలోని అందరం సమీపంలోని గుంత నుంచి నీరు తెచ్చుకుంటున్నాం. ఒక వేళ కొళాయిల్లో నీరు వచ్చినా బురదగా ఉంటోంది. తాగేందుకు పనికిరావడం లేదు. అధికారులకు చెప్పినా ప్రయోజనం లేదు. – గుమ్మిడి పేరమ్మ, నాగినేరి గ్రామం

గుంతలోని నీరే దిక్కు



మచినీటి పథకం నీరు వారానికి ఒకసారి కూడా రావడం లేదు. పథకం నీరు ఎప్పుడు వస్తుందో కూడా తెలియదు. గ్రామ సమీపంలోని గుంత వద్దకు వెళ్లి నీరు తెచ్చుకుంటున్నాం. వాటినే తాగుతున్నాం. గుంతలో కలుషిత నీరు తాగడం వల్ల రోగాలు వస్తున్నాయి.

– రెంటమల్లు జదమ్మ, వేలికాడు

మా కాలనీకి పథకం నీళ్లే రావు



వెలికాడులోని గిరిజన కాలనీకి పైపు లైన్ వేసి ఇంటింటికీ కొళాయిలు ఇచ్చారు. మంచినీటి పథకం నీళ్లు వచ్చి ఏళ్లు గడుస్తోంది. అధికారులు, నాయకులకు చెప్పినా పట్టించుకోవడంలేదు. చేసేది లేక గుంతల్లోని నీటిని తెచ్చుకుని కాలం గడుపుతున్నాము. మాకు తాగునీటి కష్టాలు తీర్చే వారు కరువయ్యారు.

– ఎస్ సెల్వరాజ్, వెలికాడు ఎస్టీ కాలనీ

ఇబ్బంది లేకుండా చూస్తాం

తీరప్రాంతంలోని గ్రామాలకు నీటిని సరఫరా చేసే పైపులైన్ ఇటీవల మరమ్మతులకు గురైంది. దీంతో కొన్నిరోజులుగా సమస్య నెలకొంది. పైపులైన్‌ను బాగు చేయించాం. మంచినీటి పథకం ద్వారా ప్రతిరోజూ తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటాం. గ్రామస్తులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– ఉమమహేశ్వరి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, డీవీ సత్రం

వాకాడు పోలీసు స్టేషన్ తనిఖీ

వాకాడు : మండల కేంద్రమైన వాకాడులోని పోలీసు స్టేషన్‌ను శనివారం గూడూరు డీఎస్పీ గీతాకుమారి తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పాత నేరస్తుల వివరాలు, కేసులు తదితర వివరాలను సీఐ హుస్సేన్‌బాషాను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో శిథిలమైన నూతన పోలీసు స్టేషన్ భవనాన్ని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ శిథిలమైన భవనం గురించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని తెలిపారు. సమాజంలో అవినీతిని ప్రశ్నించే జర్నలిస్టులను అవమానించినా, వారి మనోభావాలను దెబ్బతీసినా, దాడి చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గూడూరు డివిజన్‌లో ట్రాఫిక్ సమస్యలపై దృష్టి పెడతానని, అరాచకాలకు అడ్డుకట్ట వేస్తామని డీఎస్పీ గీతాకుమారి తెలిపారు. ఎస్‌ఐ నాగబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

వివాదాల జోలికి వెళ్లొద్దు



గ్రామస్తులకు కౌన్సెలింగ్ ఇస్తున్న హెడ్ కానిస్టేబుల్

చిట్టమూరు : గ్రామంలో అందరూ కలసిమెలసి ఉండాలని, వివాదాల జోలికి వెళ్లొద్దని హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ సూచించారు. ఆయన శనివారం చిల్లమూరు పంచాయతీ కలగుర్తిపాడు గ్రామస్తులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో కోడి పందేలు, పేకాట, మద్యం విక్రయాలు జరుగుతున్నట్టు ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. గొడవలు కూడా జరుగుతున్నాయన్నార. ఈ క్రమంలో ఎస్‌ఐ చిన బలరామయ్య ఆదేశాల మేరకు గ్రామస్తులకు కౌన్సెలింగ్ ఇచ్చినట్టు తెలిపారు. గ్రామంలో ఏదైనా సమస్య వస్తే వెంటనే పోలీసు స్టేషన్‌కు రావాలని, గొడవలు పడొద్దని హెచ్చరించారు.

కండలేరులో 53.977 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 53.977 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 650, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 170, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

మంచుదుప్పటి



దట్టంగా కమ్మేసిన పొగమంచు



రోడ్డుపై విపరీతమైన కురిసిన మంచు

సైదాపురం: మండలంలో గతంలో ఎన్నడూ లేని విధంగా రాత్రిళ్లు పొగమంచు కురుస్తోంది. ఉదయం 8 గంటలకు వరకు వీడడం లేదు. శనివారం ఉదయం 10.30 గంట వరకు పొగ మంచు కురవడంతో రైతులు, ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాహనదారులు లైట్లు వేసుకుని వెళ్లాల్సి వచ్చింది. ఈ మంచుతో నిమ్మ చెట్లకు తెగుళ్ల వ్యాపిస్తాయని రైతులు వాపోతున్నారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు

చిల్లకూరు : రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని గూడూరులో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని జనసేన నేతలు డిమాండ్ చేశారు. వారు శనివారం మంచినీటి ట్యాంకులను పరిశీలించారు. వారు మాట్లాడుతూ పట్టణంలో పలు వాటర్ ట్యాంకులు శిథిలావస్థకు చేరుకున్నాయని తెలిపారు. వాటిని బాగుచేయాలని కోరారు. చంద్రశేఖర్, కె.మోహన్, సాయికిరణ్, వంశీ, క్రిష్ణ, సనత్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

చిట్టమూరు : సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారిణి డాక్టర్ పద్మావతి తెలిపారు. మండలంలోని ఆరూరు గ్రామంలోని పాఠశాల విద్యార్థులకు శనివారం వైద్య పరీక్షలు చేశారు. ఆమె మాట్లాడుతూ మంచు ఎక్కువగా కురుస్తోందని, దీంతో దగ్గు, జలుబు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. అలాగే వైరస్ ప్రభావంతో ఒళ్లు నొప్పులు ఎక్కువగా ఉంటాయన్నారు. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని, చలి తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో బయటకు వెళ్లొద్దన్నారు. తప్పనిసరిగా వెళ్లాల్సి వస్తే తలకు గుడ్డ కట్టుకోవాలని సూచించారు.

16 ఏళ్లుగా క్రికెట్ పోటీల నిర్వహణ అభినందనీయం



బ్యాటింగ్ చేసి క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్‌ఐ సురేష్‌బాబు

చిల్లకూరు : వివిధ గ్రామాల్లో ఉండే స్నేహితులు కలిసి 16 ఏళ్లుగా ఏడాదికొకసారి క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని ఎస్‌ఐ సురేష్ బాబు తెలిపారు. కలవకొండలోని లక్ష్మీనరసింహ స్వామి క్రీడా మైదానంలో శనివారం సీనియర్ క్రికెటర్లు క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఎస్‌ఐ బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ 40 మంది స్నేహితులు క్రమం తప్పకుండా క్రికెట్ పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. విధంగా వివిధ రంగాల్లో స్థిరపడిన స్నేహితులు ఇలా కార్యక్రమాలు నిర్వహిస్తే పాత జ్ఞాపకాలను నెమరువేసుకోవచ్చన్నారు. చింతవరం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శివసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ చిన్నతనంలో వివిధ పాఠశాలల్లో చదివినప్పటికీ అందరూ కలిసి పోటీలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సీనియర్ క్రికెట్ నిర్వాహకులు మధు, మోహన్, రఘుబాబు తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా పల్లకి సేవ



విశేషాలంకరణలో స్వామి, అమ్మవార్లు

చిల్లకూరు : మండలంలోని కలవకొండ గ్రా మంలో వెలసిన లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి పల్లకీ సేవను కనుల పండువగా నిర్వహించారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మీ అమ్మవార్లను విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను పల్లకిలో కొలువుదీర్చి ఊరేగించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా గూడూరు చెందిన తలపనేని రామచంద్రయ్య, శ్రీదేవమ్మ వ్యవహరించారు.

నాసిరకంగా రోడ్డు పనులు

అధికార పార్టీ నేతల అండతో అక్రమార్కులు నిబంధనలకు పాతరేస్తున్నారు. పదికాలాలపాటు పదిలంగా ఉండాల్సిన రోడ్డు నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలు ఇస్తున్నారు. సైదాపురం–దేగపూడి వరకు చేపట్టిన సీసీ రోడ్ల పనుల్లో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. కొద్ది రోజులకే రోడ్డు దెబ్బతిని మళ్లీ కష్టాలు పడాల్సిందేనని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- నాణ్యతకు పాతరేస్తున్న కాంట్రాక్టర్లు
- చూసీచూడనట్టు వ్యవహరిస్తున్న అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు



ఇష్టానుసారంగా వేస్తున్న బెడ్ కాంక్రీట్

సైదాపురం : మండల కేంద్రమైన సైదాపురం నుంచి దేగపూడి రోడ్డు అధ్వానంగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారి కోరిక మేరకు సీసీరోడ్డు వేయడానికి ప్రభుత్వం సుమారు రూ.43 కోట్లు మంజూరు చేసింది. పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ ఊటుకూరు, తురిమెర్ల, సైదాపురం గ్రామాల్లో సుమారు మూడు కిలోమీటర్ల సీసీ రోడ్డు పనులను సబ్ కాంట్రాక్ట్ ఇచ్చాడు. మిగిలిన బీటీ రోడ్డు పనులను అతను చేస్తున్నాడు. సైదాపురం, ఊటుకూరు, తురిమెర్ల సీసీ రోడ్ల పనుల్లో ఏమాత్రం నాణ్యత లేదు. కంకర, ఇసుక, సిమెంట్‌ను ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వాడాల్సి ఉండగా కాంట్రాక్టర్లు చేతివాటం చూపుతున్నారు. వారికి అధికారులు సహకరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోడ్డుకు చివర సాధారణంగా ఇతర ప్రాంతాల నుంచి మట్టి తీసుకువచ్చి వేయాల్సి ఉంది. కాంట్రాక్టర్లు గ్రావెల్‌ను అక్కడి మట్టినే తీసి వేస్తున్నారు. సీసీ రోడ్డుకు ముందుగా వేసి బేస్ కూడా ఇష్టానుసారంగా వేయడంతో మరుసటి రోజే కంకర కనిపిస్తోంది. ఊటుకూరులో వేసిన సీసీ రోడ్డుకు ఒక్క రోజుకూడా నీరు పట్టిన దాఖలాలు లేవు. ఇలా అయితే రోడ్లు ఎన్ని రోజులు మన్నికగా ఉంటాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్లను పరిశీలించి నాణ్యతకు తిలోదకాలు ఇచ్చిన అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



క్యూరింగ్ చేయకుండా వదిలేసిన ఊటుకూరు సీసీ రోడ్డు

శాస్త్రోక్తంగా ఊంజల్ సేవ



రాపూరు : మండలంలోని పెంచలకోనలో శనివారం సాయంత్రం పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవికి శాస్త్రోక్తంగా ఊంజల్ సేవ నిర్వహించారు. ఉదయం స్వామి, అమ్మవార్లను సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టారు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. తదుపరి స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను అలంకార మండపంలోకి వేంచేపు చేసి తిరుచ్చిపై కొలువుదీర్చారు. ఆభరణాలు, పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత సహస్ర దీపాలంకరణ మండపానికి తరలించి ఊంజల్ సేవను నేత్రపర్వంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

సముద్ర తాబేళ్ల రక్షణకు చర్యలు

- ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఏకే నాయక్





మాట్లాడుతున్న ఏకే నాయక్, సమావేశంలో పాల్గొన్న అధికారులు

నెల్లూరు(అర్బన్): సముద్ర తాబేళ్ల పరిరక్షణకు స్వచ్ఛంద సంస్థలు, మత్స్య, మెరైన్ తదితర శాఖల సమన్వయంతో యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేశామని రాష్ట్ర అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఏకే నాయక్ తెలిపారు. నెల్లూరులోని వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం తాబేళ్ల అవసరం, వాటిని కాపాడుకోవడం అనే అంశంపై వివిధ జిల్లాల అటవీశాఖ అధికారులు, ట్రీ ఫౌండేషన్ ప్రతినిధులు సంయుక్తంగా వర్క్‌షాపు నిర్వహించారు. ఏకే నాయక్ మాట్లాడుతూ ఇటీవల సముద్ర తీరంలో 2 వేల నుంచి 3 వేల వరకు తాబేళ్లు మృతి చెందాయన్నారు. దీనికి మత్స్యకారులు పెద్ద, పెద్ద యంత్రాలతో కూడిన బోట్లు, మెకనైజ్డ్ వలలను వాడడమే కారణమన్నారు. గుడ్లు పెట్టేందుకు సముద్రం నుంచి తీరంలోకి వస్తున్న తాబేళ్లు ఆ వలల్లో పడి మృత్యువాత పడుతున్నాయన్నారు. తాబేళ్లతో సముద్రంలో జీవ సమతుల్యత ఏర్పడుతోందన్నారు. అవి నీటిని పరిశుభ్రం చేస్తాయన్నారు. అలాంటి జీవులను కాపాడుకోకపోతే మత్స్య సంపదకు కూడా ముప్పు వస్తుందన్నారు. మత్స్యకారులు తీరం సమీపంలో కాకుండా దూరానికి వెళ్లి చేపల వేట సాగించాలని సూచించారు. సంప్రదాయ బోట్లను మాత్రమే వాడాలన్నారు. ఇందుకోసం మత్స్యకారులను చైతన్యం చేయాలన్నారు. మత్స్య, మెరైన్ శాఖల అధికారులు, ఎన్‌జీవోలు కలిసి ప్రణాళికాబద్ధంగా రాష్ట్ర వ్యాప్తంగా చైతన్య కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. తాబేళ్లను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం తాబేళ్ల రక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై ఫారెస్ట్, ఇతర శాఖల అధికారులు చర్చించారు. జిల్లాల వారీగా చర్చలు జరిపారు. కార్యక్రమంలో గుంటూరు ఫారెస్ట్ కన్జర్వేటర్ కేవీ రాజు, తిరుపతి కన్జర్వేటర్ సెల్వం, నెల్లూరు డీఎఫ్‌వో మహబూబ్‌బాషా, సూళ్లూరుపేట వైల్డ్ లైఫ్ ఫారెస్ట్ అధికారులు పాల్గొన్నారు.